క్లుప్తంగా

రైతన్న దేశానికి వెన్నెముక



రైతు దినోత్సవం చేసిన డీఆర్‌డీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు

దెందులూరు: రైతన్న దేశానికి వెన్నెముకని డీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. డీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో ఆదివారం నర్సింగ్ విద్యార్థులు జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఆట పాటలతో రైతుల వేషధారణలో నృత్యం చేస్తూ విద్యార్థులకు సంతోషాన్ని కల్పించారు. రైతుల కష్టం, రైతు పడే ఇబ్బందులను ఎన్ని సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ ఎంతో ఖర్చుతో కూడుకున్నప్పటికీ 365 రోజులు 24 గంటటూ కష్టపడి, ఒడిదుడుకులు ఎదుర్కొని జన జీవనానికి కావలసిన ఆహారాన్ని అందిస్తున్నారని విద్యార్థులకు తెలిపారు. రైతుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకుని ఆహార పదార్థాలను పాడు చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు.

సాల్వేషన్ చర్చికి ఆర్థిక సాయం



చర్చికి ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

దెందులూరు: నూతనంగా నిర్మిస్తున్న సాల్వేషన్ ఆర్మీ మెయిన్ చర్చికి గ్రామానికి చెందిన దాత కొత్తపల్లి సురేష్ కుమార్, శోభ లాస్య, రోహిత్ ఆదివారం రూ.55 వేల నగదును స్థానిక కోర్ ఆఫీసర్ ఎం.రమణయ్యకు అందజేశారు. దాతలను సంఘ పెద్దలు పీఎస్ గాంధీ, రిటైర్డ్ ఆఫీసర్ జోషియా, సంఘస్తులు తదితరులు అభినందించారు.

అండర్‌పాస్‌లో విద్యుత్ సౌకర్యం ఏదీ?

దెందులూరు: దెందులూరు అలుగులగూడెం రైల్వే ట్రాక్ వద్ద నిర్మించిన అండర్‌పాస్‌లో రెండు వైపులా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు ప్రయాణికులు పాదచారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అండర్‌పాస్‌లో ప్రతి రోజూ మూడు మండలాల ప్రజలు, రైతులు విద్యార్థులు, వ్యాపారస్తులు రాకపోకలు సాగిస్తారు. కోట్లాది రూపాయలతో అండర్‌పాస్ నిర్మించిన రైల్వేశాఖ అధికారులు రెండు వైపులా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రైల్వేశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి రెండు వైపులా విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

జిల్లా మహా సభలు జయప్రదం చేయాలి

ఉంగుటూరు: ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో ఏపీ రైతు సంఘం జిల్లా మహా సభలు నిర్వహిస్తామని, జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ వెల్లడించారు. కైకరంలో ప్రజా సంఘాల కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. మూడేళ్లకోసారి అన్ని స్థాయిల్లో సంస్థాగత మార్పులు చేస్తామన్నారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ శ్రీనురాజు

టి.నరసాపురం: వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గం సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నియమించడంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని పార్టీ టి.నరసాపురం మండల కన్వీనర్ శ్రీను రాజు అన్నారు. టి.నరసాపురంలో సహకార సంఘం మాజీ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య నివాస గృహం వద్ద ఆదివారం సాయంత్రం ఆయన పలువురు మండల నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. బాలరాజు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి ముత్తయ్యలతో పాటు జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, కాల్నీడి సుబ్బారావు, ఎంపీటీసీ నార్లపాటి వెంకట్రావు, నాయకులు ఒంటిపల్లి సుబ్రహ్మణ్యం, కటకం మల్లికార్జునరావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

లింగపాలెం: ధర్మాజీగూడెం గ్రామ శివారులో పేకా ట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశామని, రూ.14900 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. జూదక్రీడలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మలుపులు.. ప్రమాదాలకు నెలవులు



పిప్పర కనకదుర్గ గుడి వద్ద ప్రమాదకర మూడు రోడ్ల కూడలి



నాగనమిల్లి వద్ద ప్రమాదకర మలుపు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- క్షతగాత్రులవుతున్న అనేక మంది ప్రయాణికులు



రాచూరులో ప్రమాదకరమైన మలుపు



గణపవరం సెంటర్ బండిరేవు వద్ద ప్రమాదకర మలుపు

గణపవరం: గణపవరం నుంచి పలు పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపులు ప్రయాణికులకు ప్రాణ సంకటంగా తయారయ్యాయి. దీనికి తోటు మలుపుల్లో చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. దీని వలన ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించే పరిస్థితి లేదు. గణపవరం పట్టణంలో సైతం పలుచోట్ల ఆర్‌అండ్‌బీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గణపవరం నుంచి తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, ఆకివీడు వైపు వెళ్లే ప్రధాన రహదారులపై కొన్ని చోట్ల ఎల్ ఆకారంలోనూ, మరికొన్ని చోట్ల ఎస్ ఆకారంలోనూ మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద వాహనాలు వెంట్రుక వాసిలో ప్రమాదాల బారి నుంచి బయట పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పట్టణ పరిధిలో అయితే రోడ్డు మార్జిన్లు కూడా ఆక్రమించి వ్యాపారులు తమ దుకాణాలను ముందుకు జరిపేయడంతో రోడ్లు ఇరుకుగా మారాయి. ఇటీవల పట్టణ పరిధిలో రోడ్డు మీదకు చొచ్చుకొచ్చిన షెడ్లను తొలగించడంతో పరిస్థితి కొంత మెరుగుపడింది. పూర్తి స్థాయిలో ఆక్రమణలు తొలగిస్తే రోడ్లు మరింత సువిశాలంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

బిక్కు బిక్కుమంటూ ప్రయాణాలు

గణపవరం–తాడేపల్లిగూడెం రహదారిలో బండిరేవు వద్ద, ఎ.గోపవరం శివారును ఎస్ ఆకారపు మలుపు, పిప్పర కనకదుర్గ గుడి వద్ద, పిప్పర సెంటర్‌లోనూ మూడు రోడ్లు కలిసే కూడళ్ల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. ఇక్కడ ఏ క్షణంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడుపుతుంటారు. గణపవరం–ఏలూరు రోడ్డులో బొబ్బిలి వంతెన దిగువన మూడు రోడ్ల కూడలిలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఏలూరు వైపు వెళ్లే వాహనాలు, ఆకివీడువైపు నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పుకోవడం గగనంగా ఉంటుంది. వాహనాలు ఎదురెదురుగా సమీపంలోకి అంటే ఐదారు అడుగుల దూరంలోకి వస్తే తప్ప కనిపించకపోవడం వలన నిత్యం ప్రమాదం పొంచి ఉంటుంది. ఇక భీమవరం వైపు వెళ్లే రహదారిలో సరిపల్లె వెలంపేట వద్ద, బీసీ కాలనీల వద్ద ఉన్న ఎల్ ఆకారపు మలుపులలో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు.

వాహనాల నిలుపుదలతో మరింత ప్రమాదం

బాలయ్య చెరువు ఉన్న మలుపు వద్ద మార్జిన్‌లో వాహనాలు నిలుపుదలచేసి ఉండటం వలన ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడం ఇబ్బందికరంగా ఉంటుంది. మండలపర్రు వంతెన వద్ద, నాగనమిల్లి పుంతలో ముసలమ్మ గుడి వద్ద ఎస్ ఆకారపు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. మండలపర్రు వంతెన మలుపు వద్ద ఇటీవలి కాలంలో రెండు ట్యాక్సీలు, రెండు లారీలు మలుపు వద్ద కాలువలోకి దూసుకుపోయాయి. ఇలాంటి ప్రమాదకర మలుపుల వద్ద చెట్లు, తుప్పలు, పిచ్చి మొక్కలు తొలగిస్తే కొంతమేర ప్రయోజనం ఉంటుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఏలూరు రోడ్డులోని రాచూరు వద్ద ఎస్ ఆకారపు మలుపు ప్రమాదకరంగా ఉంటుంది. ఈ మలుపులో రోడ్డుకు మార్జిన్లు లేక ఇరుకుగా తయారై వాహనాలు తప్పుకోవడం గగనంగా ఉంటుంది. ఇలాంటి మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేస్తే కొంతైనా ఫలితం ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు.

మాతృభూమిపై కృతజ్ఞతా భావం ఉండాలి



కుటుంబ విలువలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఎస్ఎస్ నేతలు

భీమడోలు: మాతృభూమిపై భక్తి, త్యాగం, కృతజ్ఞతా భావంతో మెలగాలని ఆర్‌ఎస్ఎస్ నేత జల్లా రమేష్ అన్నారు. గుండుగొలను శ్రీవిఘ్నేశ్వర సేవా సమితి భవనంలో ఆదివారం ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌ఎస్ఎస్ జెండాను ఎగురవేశారు. వ్యవస్థాపకులు, భరతమాత చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశంలో 1925 దసరా రోజున ప్రారంభించిన ఆర్‌ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. సమాజ హితాన్ని కోరుతూ సమాజాన్ని సంఘటితం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు కోడూరి లక్ష్మీనరసింహమూర్తి, సీహెచ్ మూర్తి, బొల్లిన కోటేశ్వరరావు, పేరిచర్ల సునీల్ వర్మ, ప్రవీణ్ కుమార్ పటేల్, నల్ల శంకర్, బలగం శ్రీను, కాబోతుల సోమేశ్వరరావు, కర్రి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

భీమడోలు: స్థానిక పోస్టాఫీసు రోడ్డులో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ దసరా ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఆదివారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. తొలుత అమ్మవారికి పూజలు చేశారు. 11 రోజుల పాటు ఈ ఆలయం వద్ద ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పత్సమట్ల భీమరాజు, ప్రత్తి మదన్, ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

తుది దశకు బ్రిడ్జి మరమ్మతులు



బ్రిడ్జి మీదుగా తిరుగుతున్న ద్విచక్ర వాహనాలు

ఉంగుటూరు: నారాయణపురం వంతెన మరమ్మతు పనులు పనులు తుది దశకు చేరాయి. శ్లాబ్ వేసిన 21 రోజుల తరువాత ద్విచక్ర వాహనాలను వదిలారు. దీంతో నారాయణపురం గ్రామంతో పాటు కొల్లేరు తీర గ్రామాల ప్రజల అవస్థలు తీరనున్నాయి. నారాయణపురం బ్రిడ్జి పడిపోవడంతో, ఆ తరువాత చేపట్టిన మరమ్మతుల కారణంగా నెలల తరబడి ప్రజలు అవస్థలు పడ్డారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లడానికి పడరాని పాట్లు పడ్డారు. కొంత కాలం వేరే మార్గాలు లేక సుదూరం నుంచి ప్రయాణికులు తెలియక వచ్చి, వెనుదిరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొందరైతే వేరే పారంతం నుంచి వెళ్లేవారు. ప్రస్తుతానికి ద్విచక్ర వాహనదారులు బ్రిడ్జిపై నుంచి వెళుతున్నారు. త్వరలో నాలుగు చక్రాల వాహనాలను వదలనున్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి అత్యంత హేయమైన చర్య అని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. గవాయ్‌పై దాడిని నిరశిస్తూ ఆదివారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ గవాయ్‌పై దాడిచేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎస్సీలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సిర్రా భరత్ మాట్లాడుతూ ఈ దేశంలో సనాతన పేరుతో దౌర్జన్యాలు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. మత్తే బాబి, ఎరికపాటి విజయ్, కనికెల్లి మురళీకృష్ణ మాట్లాడుతూ 145 కోట్ల జనాభా యోగక్షేమాలతో జీవించాలంటే భారత రాజ్యాంగాన్ని, మానవ విలువలను, హక్కులను కాపాడాలి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోదుల స్వరూప్, పాము మాన్సింగ్, అంబటి నాగేంద్రప్రసాద్, కనికెల్లి రవి ప్రసాద్, కర్రికోటి దిలీప్, రాగోలు సురేష్, రాజేష్, పల్లి విజయ్, ఎంపీటీసీ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 18వ తేదీ నుంచి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు నవంబర్ 1న మండల స్థాయిలో, 23న జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొ న్నారు. జిల్లా స్థాయిలో విజేతలకు డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. పూర్తివివారలకు, ప్రశ్న పత్రాలకు ఫోన్ నంబర్లు 82476 32961, 99896 32961, 70932 12999 సంప్రదించాలని తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీత గ్రంథాన్ని అందజేస్తున్న హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

పెదపాడు : త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో కుల మతాల అసమానతలు తొలగింపబడతాయని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు విభాగం అధ్యక్షుడు అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని కొక్కిరపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం ఆదివారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, రామాంజనేయులు, అశోక్, శ్రీకాంత్, వంశీ, సుందరరావులు పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన

భీమడోలు: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భీమడోలు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఈ నెల 13వ తేదీ ఉదయం 9.30 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలా అన్ని ప్రాంతాల్లో తయారీ చేసి, ప్రజల ప్రాణాలను హరిస్తున్నందుకు గాను వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఏలూరు పార్లమెంట్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్ కుమార్ హాజరవుతారన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అ‘పూర్వ’ కలయిక



పోతునూరు పాఠశాలలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

దెందులూరు: స్నేహబంధం అన్ని బంధాల్లో మధురమైనదని రాజమండ్రి డివిజన్ దూబచర్ల వ్యవసాయ శాఖ హెచ్‌వో గంజి రమేష్, రైల్వే ఉద్యోగి బోయిన ఫణికుమార్ అన్నారు. ఆదివారం దెందులూరు మండలం పోతునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2003–2004 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ గురువులు టి.అన్నమ్మ, సీతారామశాస్త్రి, అప్పారావు, రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వైద్యశాఖ ఉద్యోగులు కనకాల నాగశివ, కె.జ్యోతి ఉపాధ్యాయులు పరమట విజయలక్ష్మి, కె.హరి వెంకటలక్ష్మితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాఠశాలలో చదివిన రోజులు గుర్తు చేసుకున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

పెదపాడు: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించడం నేరంగా పరిగణించి అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట పెదపాడు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా అన్నసమారాధన

ఉంగుటూరు: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త అద్దేపల్లి శేషయ్య కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఆలయం వద్ద ప్రతి మంగళవారం జరుగుతున్న అన్నసమారాధన ప్రశ్నార్థకంగా మారింది. కోర్టులో ఇరువర్గాల వాదనలు నడుస్తున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో, హైస్కూలు ఆవరణలో పదిమంది గుమికూడకూడదని తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నలుగురికి మించి గుమికూడకూడ దన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు నిషేధం విధిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కారణంగా అక్కడ అన్నసమారాధన కార్యక్రమం ప్రశ్నార్థకంగా మారింది. అయితే భోజనాలు వేరే చోట ఏర్పాటు చేస్తారన్నట్లు సమాచారం.

వెంటపడుతున్న వీధి కుక్కలు



పవరు పేటలోని ఒక వీధిలో ఉన్న వీధి కుక్కలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనచోదకులను వెంబడిస్తున్నాయి. కుక్కల బారి నుంచి తప్పించుకునేందుకు ప్రజలు, వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నా ఫలితం ఉండడంలేదని బాధితులు, ప్రజలు వాపోతున్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు

ఇటీవల వీధి కుక్కల నియంత్రణపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీలు, మున్సిపాల్టీలు, నగరాల్లో కుక్కలను నియంత్రించాల్సిన నైతిక బాధ్యత ఆయా స్థానిక సంస్థలదే అనేది ఈ తీర్పు సారాంశం. ఎవరెన్ని మొట్టికాయలు వేసినా వీధి కుక్కల నియంత్రణకు కనీస చర్యలు చేపట్టకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడప్పుడూ మొక్కుబడిగా చేపట్టే కార్యక్రమాలు కాకుండా నిర్దిష్ట ప్రణాళికతో వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని నగర వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

రోడ్లపైనే తిష్ట

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్ల పరిధిలో అనధికార లెక్కల ప్రకారం మూడు వేలు వరకు వీధి కుక్కలు ఉన్నట్లు సమాచారం. అధికారులు మాత్రం నగరంలో 1900 నుంచి రెండు వేలు వరకు వీధి కుక్కలు ఉన్నట్లు చెబుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ప్రతి డివిజన్ పరిధిలో 40 నుంచి 50 వరకు కుక్కలు రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. కుక్కలు బెడదపై సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుక్కలు కరిచిన ఆస్పత్రులు పాలవుతున్న వారి పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది.

వీధి కుక్కలపై నిర్లక్ష్యం

ఏలూరు నగరంలో దాదాపు 1500 వరకు పెంపుడు కుక్కలు ఉన్నాయి. వీటన్నింటికీ జూలై నెలలో వచ్చేయాంటీ రాబీస్ దినోత్సవం సందర్భంగా అన్ని పశువైద్యశాలలో పెద్ద ఎత్తున యాంటీ రాబీస్ వ్యాక్సిన్‌లు వేస్తున్నారు. ఇదే సమయంలో వీధి కుక్కలను పట్టించుకునే వారు లేరు. కుక్కల దాడిలో గాయపడిన ప్రజలు ఆస్పత్రుల చుట్టూప్రదక్షిణలు చేస్తున్నారు.